


# ఆక్టోపస్

"ఊరకరారు మహానుభావులు! రండిసార్! రండి" అన్నాడు హనుమాన్జీ

"నేనంత ఊరిపోయానంటావా?" అన్నాడు నవ్వుతూ లక్ష్మోజీ.

"అమ్మమ్మ! ఎంత మాట! నిన్నంత మాటని నేనీ ఊళ్ళో నిలవగలనా గురూ!" అన్నాడు ముసిముసి నవ్వులు నవ్వుతూ హనుమాన్జీ.

"ఏడిశావులే! వెధవ్వేషాలెయ్యకు. నువ్వూ బాగానే ఊరుతున్నావ్ ఈ మధ్య" అన్నాడు తిరిగి లక్ష్మోజీ.

"సరే గానీ, ఏమిటి గురూ నువ్వే వచ్చావ్ ? కాకితో కబురంపితే నేనే వచ్చేవాణ్నిగా"!

"సమయానికి ఏ కాకి దొరకలేదులే"

"ఏదో ఓ పిచికని పంపినా సరిపోయేది గదా!"

"నేనే ఆ పిచిక ననుకో"

"అబ్బో! నీకేం బంగారు పిచికవి" అన్నాడు కళ్ళు మూసుకుని హనుమాన్జీ

"ఈ వెధవ చమత్కారాలేనా! ఏమన్నా పాయింట్లో కొస్తావా? అన్నాడు లక్ష్మోజి!

"ఆజ్ఞాపించు గురూ! నేనూ! నా బ్యాంకూ నీ దాసులం"

హనుమాన్జీ ఓ బ్యాంకు మేనేజర్. లక్ష్మోజీ ఓ లోకల్ ఆక్టోపస్. ఇద్దరూ చిన్నప్పుడు ఒక ఊళ్ళోనే చదువుకున్నారు. ఎనిమిదొందలకి పద్నాలుగేళ్ళ క్రితం ఆ బ్యాంక్లో క్లర్క్గా చేరి ఇవ్వాళ మూడువేల ఐదొందల మేనేజరయ్యాడు హనుమాన్జీ. తొంభైవేలతో

తొమ్మిదేళ్ళ క్రితం ఆ ఊరు చేరి ఇవ్వాళ తొమ్మిది కోట్లకి అధిపతి అయ్యాడు లక్ష్మోజీ.... హనుమాన్జీ కెప్పుడూ అదే ఆలోచన. వీడింత మాగ్నెట్ ఎలా అయ్యాడు? ఆక్టోపస్ లాగా ప్రతి బిజినెస్ లోకి తన చెయ్యి ఎలా చాచాడు..?"

హనుమాన్జీ మాటకి సమాధానంగా నాకు గోల్డ్ లోన్ కావాలి" అన్నాడు లక్ష్మోజీ

"గోల్డ్ లోనా? నీకా?" ఆశ్చర్యపోయాడు హనుమాన్జీ

"నాక్కాదు, మా ఆవిడికి" అన్నాడు లక్ష్మోజీ

"ఇందులో ఏదో తిరకాసో, టాక్సకాజో వుందనుకున్నాడు హనుమాన్జీ" ఎంత కావాలి?" అన్నాడు నీరసంగా.

"వంద రూపాయిలు" అన్నాడు నవ్వుతూ లక్ష్మోజీ.

హనుమాన్జీ కాళ్ళకి పక్షవాతం వచ్చేసినట్టయింది. లక్ష్మోజీ యొక్క రొటేషన్ చక్రవర్తిత్వం ఎప్పటికప్పుడు తెలుసుకుందామని ప్రయత్నిస్తే అంత అంధకార బంధురం అయిపోతోంది హనుమాన్జీకి.



బ్రీఫ్‌కేస్‌లోంచి సంతకాలు చేసిన కాగితాలు, ఓ వడ్డాణం తీశాడు లక్ష్మోజీ

"వంద రూపాయిల గోల్డ్ లోన్‌కి ఇంత వడ్డాణమెందుకు గురూ! ఏ చిన్న వస్తువయినా చాలు" అన్నాడు హనుమాన్జీ.

"ఇది పెడితే తప్పేం లేదుగా?" అన్నాడు లక్ష్మోజీ

"ఏం లేదనుకో" అన్నాడు హనుమాన్జీ

"ఇంతకన్నా చిన్న వస్తువేమీ ప్రస్తుతం నాదగ్గర రెడీగా లేదు" అన్నాడు లక్ష్మోజీ.

"ఆల్‌రైట్! ఆల్‌రైట్ ఏం ఫరవాలేదు" అంటూ పనిపూర్తిచేసి లక్ష్మోజీని పంపించేశాడు హనుమాన్జీ.

రెండు నెలల తర్వాత వచ్చి నూట మూడు రూపాయిలు అసలు వడ్డీ కట్టాడు లక్ష్మోజీ. సేఫ్‌లోంచి నగ తెచ్చి యిచ్చాడు హనుమాన్జీ. మళ్ళీ అవసరపడ్డప్పుడు వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు లక్ష్మోజీ.

★ ★ ★

ఎవరో భార్యాభర్తలు వస్తే లాకర్ తెరవడానికి వెళ్ళాడు హనుమాన్జీ. వాళ్ళేదో లాకర్లో దాచిన నగ తీసుకెళ్ళడానికి వచ్చినట్టున్నారు. ఆ విషయం స్ఫురించగానే కరెంట్ షాక్ తిన్నట్టుగా అయిపోయాడు హనుమాన్జీ. ఔను లక్ష్మోజీ చేసిందీ ఇదే పనిగదా! గోల్డ్ లోన్ అని చెప్పి బ్యాంకులో నగ దాచుకున్నాడు. ఎంత కట్టినా ఏడాదికి పద్దెనిమిది రూపాయిలు కడతాడు. మరి ఈ భార్యాభర్తలు నూట పాతిక రూపాయలు కడుతున్నారు. పైగా వీళ్ళు లాకర్ వాడుకున్నా, వాడు కోకపోయినా! నూట పాతిక కట్టాల్సిందే. మరి లక్ష్మోజీ వాడుకున్న రోజులకే కడతాడు ఆ అమ్మ నా లక్ష్మోజీ! బ్యాంక్ లాకర్‌లోనే కాటేజీ నువ్వు పెట్టేశావు గదరా? ఇదా నీ ఆక్టోపస్సీ!